క్లుప్తంగా

ఏపీ స్పీకర్ వ్యాఖ్యలు సరికాదు

గుండాల: 1/70 యాక్ట్, ఇతర ఆదివాసీ చట్టాలపై ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామిక మని, వాటిని తిప్పి కొట్టాలని ఆలిండియా ట్రైబల్ ఫోరం ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విశాఖలోని నోవాటెల్ హోటల్లో జరిగిన టూరిజం పారిశ్రామికవేత్తల సమావేశంలో ఏపీ స్పీకర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి 1/70 చట్టం ఆటంకంగా ఉందని, దాన్ని సవరణ చేయాల్సిన అవసరం ఉందని ప్రకటించడం సరికాదని విమర్శించారు. 1/70 చట్టంపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరుగుతున్న ఏపీ రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర నాయకులు కృష్ణ, మంగయ్య, రాజయ్య పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

పినపాక: ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని సూచించారు. బుధవారం ఆమె పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల పోతిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, అక్కడ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకా ఏ మోతాదులో వేస్తున్నారో పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులు బిడ్డల ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని ఉపాధి పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలను ఎంపీడీఓ మహాలక్ష్మి బుధవారం పరిశీలించారు. మొక్కల పెంపకంలో శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయితీలను పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆమె పంచాయతీలో రికార్డును పరిశీలించారు.

స్టడీ మెటీరియల్ వితరణ

పినపాక: ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ గురుకులం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. బుధవారం విప్పలగుంపు గ్రామంలో ఎంఈఓ కొమరం నాగయ్య చేతుల మీదుగా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడు.. నవోదయ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మహర్షి స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్టడీ మెటీరియల్ ను విప్పల గుంపుతో పాటు కిష్టాపురం, కొత్తూరు, అమరవరం ప్రాథమిక పాఠశాలల్లో సైతం అందజేశారు. అనంతరం మహర్షి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావును ఎంఈఓ, ఇతర ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ రాంగోపాల్, డీఆర్పీలు శ్రీకాంత్, రాజేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, లచ్చు, జమ మూర్తి, ప్రశాంత్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాపారావు, సాంబ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

పినపాక: మండల పరిధిలోని తోగ్గూడెం గ్గ్రామంలోని జీఎస్ఎస్ డే కేర్ సెంటర్ లోని చదువుకుంటున్న 80 మంది పేద విద్యార్థిని విద్యార్థులకు బుధవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తోగ్గూడెం ప్రాథమిక ప్రధాన ఉపాధ్యాయురాలు కుంజా అనిత, ఉపాధ్యాయులు అనిల్ చేతుల మీదుగా దుస్తులు అందజేసేరు. జీఎస్ఎస్ సంస్థ ప్రతినిధి మురళీ కృష్ణా రెడ్డి సెంటర్ ఇన్‌చార్జ్ బడే సాగర్, టీచర్ మైపా రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యలో నాణ్యత కరువు

భద్రాచలంటౌన్: దేశంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సరిపడా నిధులు లేక నాణ్యమైన పరిశోధనలు జరుగక పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్‌లు లేక విద్యా వ్యవస్థ కుంకుపడుతున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల అజాద్ అన్నారు. పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సందర్భంగా బుధవారం విద్యార్థి ర్యాలీ భారీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ర్యాలీలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ప్రదర్శించిన డప్పు డాన్స్ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, కాంపాటి పృథ్వీ, బి.భాస్కర్, నరేందర్, ఎస్.అనిల్, సాయి, అఖిల్, ప్రవీణ్, సురేష్, వెంకటేష్, మహేందర్, వినోద్, సంధ్య, గణేష్, కావ్య, రమేష్, సీతారాం, రాకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రూ.6 చెల్లించాలి

గుండాల: ప్రభుత్వం తునికాకు సేకరణకు టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని, 50 ఆకుల కట్టకు రూ.6లు చెల్లించాలని న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు గణేష్, భూషనం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను ఆకు సేకరణకు ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ డబ్బులు చెల్లింపులలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధార్ సేవలకు బ్రేక్



సేవలు నిలిచిపోవడంతో బోసిపోయిన ఆధార్ నమోదు కేంద్రం

- ఆరు నెలలుగా ఇదే తీరు..
- ఆధార్ అప్‌డేట్, అనుసంధానం కోసం ప్రజలు ఇక్కట్లు
- సేవల కోసం పొరుగు మండలాలకు పరుగులు

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. యూఐడీఏఐ సంస్థ తరపున ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు ఆధార్ సేవలు అందుతున్నాయి. అయితే ఇటీవల కాలంలో ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు మండల ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిదీ ఆధార్‌తోనే అనుసంధానం..

ప్రస్తుతం ప్రతీ చిన్న పనికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అయింది. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు నిత్యం ప్రజలు అవసరమైన సేవలు. బ్యాంకు ఖాతాల నుంచి ఐడీ ప్రూఫ్‌ల వరకు ఆధార్‌తోనే పని. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు అందించే మీ సేవా కేంద్రాలు అందుబాటులో ఉండాల్సి ఉంది.

వ్యయ ప్రయాసలు..

నిత్యం అవసరమైన మీసేవా కేంద్రాలు పనిచేయకపోవడంతో ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో గిరిజనులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ మీ సేవ కేంద్రంతో పాటు పలు అనుసంధాన మీసేవా కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. దీంతో మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆధార్ అనుసంధానం చేసుకునేందుకు, అప్‌డేట్ కోసం ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పక్క మండలాలైన పినపాక, కరకగూడెం, అశ్వాపురంకు వెళ్లి ఆధార్ సేవలు పొందుతున్నారు. పరిస్థితిని గమనించి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టి సారించి ఆధార్ కేంద్రంలో సేవలను పునరుద్ధరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఆధార్ కేంద్రాలకు ఏమైంది?

మండల కేంద్రంలోని మణుగూరు తహసీల్దార్ సమీపాన మీసేవతోపాటు ఇతర ప్రాంతాల్లోని అనుసంధాన ఆధార్ కేంద్రాల్లో సేవలు నిలిచిపోవడానికి సాంకేతిక లోపాలే ప్రధాన కారణం. సంబంధించి కంప్యూటర్లు, బయోమెట్రిక్‌లలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో పూర్తిగా పని చేయడం లేదు. తద్వారా సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్యలు తలెత్తి ఆరు నెలలు గడుస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆధార్ కేంద్ర నిర్వాహకులు సైతం సాంకేతిక లోపాలు తొలగిపోయి సేవలు ఎప్పుడు ప్రారంభమవుతాయో చెప్పలేని పరిస్థితి ఉంది.

సేవలను పునరుద్ధరించాలి..

గత కొంతకాలంగా మణుగూరులోని ఆధార్ కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పిల్లల బయోమెట్రిక్ కోసం అవస్థలు పడుతున్నాం. ఈ ప్రాంతంలో ఆధార్ సేవలు పని చేయకపోవడంతో పినపాక, కరకగూడెం ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. వెంటనే ఆధార్ సేవలను పునరుద్ధరించాలి.

– వై.శైలజ, గృహిణి

ఇబ్బందులు పడుతున్నారు..

స్థానిక ఆధార్ కేంద్రంలోని సేవలు పని చేయడం లేదు. ఆధార్‌లో ఏమైనా మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవస్థలు పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆధార్ కోసం ఎంత కాలం ఇలా ఇబ్బందులు పడాలో తెలియడం లేదు. అధికారులు, పాలకులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి.

– కె.రామకృష్ణ, కాంట్రాక్ట్ కార్మికుడు

కేంద్రం చుట్టూ తిరుగుతున్నాం..

గత కొన్ని రోజులుగా మణుగూరులోని ఆధార్ కేంద్రంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సేవలు నిలిచిపోయాయి. ఆనాటి నుంచి ఆధార్ అప్‌డేట్, నూతన ఆధార్ కోసం కేంద్రం చుట్టూ తిరుగుతున్నాం. రోజులు గడుస్తున్నాయి. కానీ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. పొరుగు మండలాల్లోని కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– నాగేశ్వరరావు, ఉద్యోగి

బకాయిలు చెల్లించాలి


దమ్మపేట: నిరసన చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. అశ్వారావుపేటలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ నిరసన కార్యక్రమ అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అక్కడి సిబ్బందికి అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు గుడ్లు, వంట బిల్లులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగదుర్గ, యామిని, మహలక్ష్మి, సీత, రమాదేవి, పద్మ, విజయ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు కార్మికులు జ్యోతి, కృష్ణవేణి, నాగమణి, ఈశ్వరమ్మ, మంగా తదితరులు పాల్గొన్నారు.

అయిలయ్య సంతాప సభ


దుమ్ముగూడెం: అయిలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: సీపీఎం మండల కార్యాలయంలో కాసాని అయిలయ్య సంతాపసభను పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయిలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. నేటి తరానికి ఆదర్శ నేత అయిలయ్య అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు బొల్లి సత్యనారాయణ, మర్మం సమ్మక్క, మహమ్మద్ బేగ్, అపక రంగయ్య, కొడి వీరాస్వామయ్య, కల్లూరి శ్రీనివాస్, కారం వెంకటేశ్వర్లు, రమేష్, కల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కాసాని అయిలయ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిర అయిలయ్య సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, నిమ్మల మధు, పాయం అమల, గొగ్గెల ఆదినారాయణ, కుంజా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: సీపీఎం పార్టీకి కాసాని అయిలయ్య అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. బుధవారం అశ్వారావుపేటలోని పార్టీ కార్యాలయంలో ఐలయ్య సంతాప సభ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, సోడెం ప్రసాద్, నిర్మల, కలపాల భద్రం పాల్గొన్నారు.

నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ రంగం సంబంధిత నల్ల చట్టాలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని వామపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి, ధర్నాలు చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా చట్టాలకు చేస్తోందని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు


మణుగూరుటౌన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


ములకలపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో ఏర్పడుతుందని స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేటలోని 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, నారంవారిగూడెం, అలాగే దమ్మపేట మండలంలో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులంతా గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.నరేశ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ములకలపల్లి టౌన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: పలువురు మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీ జనాభా, పెండింగ్ బిల్లుల బకాయిలపై అసెంబ్లీ ముట్టడి చేసేందుకు వె వెళ్తున్న సమాచారం మేరకు వీరిని ముందస్తుగా అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై యయాతి రాజు తెలిపారు. అరెస్టైన వారిలో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు నారం రాజశేఖర్, కలపాల దుర్గయ్య, సోమాని శివశంకర్ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ తదితరులున్నారు.

తప్పల తడకగా కులగణన

దుమ్ముగూడెం: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పుల తడక అని, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని బీఆర్ఎస్ బీసీసెల్ మండల నాయకులు కుమ్మరికుంట సూర్య బుదవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వే తప్పుల తడకగా, కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉందని అన్నారు. ఇలాంటి సర్వేని చట్టసభల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తప్పుడు సమాచారమిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

మణుగూరురూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు నిశాంత్‌రావు తెలిపారు. బుధవారం మణుగూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫిబ్రవరి 10వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి 19సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ వేయనున్నట్లు తెలిపారు.మణుగూరు ఎంపీఓ పి.వెంకటేశ్వర రావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో బాలమేళా ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో బాలమేళా కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు ఎంఏ వాజీద్ మాట్లాడుతూ.. అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం పునాది కార్యక్రమం ద్వారా విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించేందుకు బాలమేళా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ బాణోత్ సేవ్యా, ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కృష్ణ, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

దుమ్ముగూడెం: మండలంలోని కోన బోయినగుంపు, కొమ్మనాపల్లి, పాతకొత్తపల్లి, పాయం వారి గుంపు, మారాయిగూడెం, చెరుపల్లి, కోయనరసాపురం పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్ఎం ఏవీ రామారావు బుధవారం సందర్శించారు. బాల మేళా కార్యక్రమంలో భాగంగా కాంప్లెక్స్ సెక్రటరీ, రత్నాకర్, సీఆర్పీలతో కలిసి సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన (మోడల్స్, టీఎల్ఎం) బోధనోపకరణాలను పరిశీలించి అభినందించారు. ఈ ప్రదర్శనలు విద్యార్థుల అభ్యాసనను మెరుగు పరచడానికి, విద్యార్థి లోపలి ప్రతిభా పాటవాలను వెలికి తీయడంలో తోడ్పడతాయని, కాంప్లెక్స్ హెచ్ఎం అన్నారు.


చిన్నారులు రూపొందించిన చిత్రాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

మూడోరోజు ముత్యాలమ్మ జాతర

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. మూడో రోజు ఉదయం భక్తులు అందించి చీరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దాతలు ఆర్థికసాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు ఆలయానికి చేరుకున్న భారీ భక్తుల సందడితో అమ్మవారి మొదటి ఊరేగింపును చేపట్టారు. మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని యువకులు ఆడ వేశధారణతో అమ్మవారి గరిగెలను తలపై పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపుకు గరిగెలు బయల్దేరే క్రమంలో ఆలయంలోని ధ్వజస్తంభం పైన ఉన్న గంటలు మోగి అమ్మవారి నిజరూపాన్ని వ్యక్తమైంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భీమవరంకు చెందిన మోహన్ ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్ భక్తులను కట్టిపడేసింది. ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి అధ్వర్యంలో భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.


గరిగెలతో మొదటి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అవగాహన కార్యక్రమాలు..

● సైబర్ నేరాలపై..


సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయలక్ష్మి

భద్రాచలంఅర్బన్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న టీటీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డయల్ 100, షీ టీం తదితర అంశాలపై బుధవారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఫోన్‌లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే వెబ్‌సైట్లను ఓపెన్ చేయవద్దని, దానివల్ల మన సమాచారం దొంగిలించే అవకాశం ఉందని వివరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, పోక్సో కేసుల ఇతర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఆమె అవహగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

● కుష్ఠు వ్యాధి నిర్మూలనపై..

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి చర్మానికి, నరాలకు వస్తుందని తెలిపారు. ముదురు రాగి రంగు మచ్చలుండి స్పర్శ లేని వారిని పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు స్పర్శ లెప్రసీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది రాంప్రసాద్, వసతిగృహ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదాలపై..


వాహన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై రాజ్ కుమార్

పినపాక: నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఎస్సై రాజ్ కుమార్ వాహనదారులకు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో సరైన ధ్రువపత్రాలు లేని వాహన దారుల పైన కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అతివేగంగా, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ పత్రాలు దహనం

దుమ్ముగూడం: కేంద్ర బడ్జెట్‌లో మెజారిటీ రాష్ట్రాలకు మొండి చేయి చూపడాన్ని నిరసిస్తూ.. బుధవారం ములకపాడు సెంటర్‌లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలు దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ మాట్లాడారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు బొల్లి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మర్మం సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, సీఐటీయూ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


చంద్రుగొండ: రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

చర్ల: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ అసెంబ్లీలో తీర్మానించడంపై జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం చర్లలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా స్థానిక మాలమహానాడు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మతో నినాదాలు చేసుకుంటూ అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు.. అక్కడ ధర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు జిల్లా కన్వీనర్ తోటమళ్ల రమణమూర్తి, కోకన్వీనర్ ఏడెళ్ల గణపతి, మండల అధ్యక్షులు తోటమళ్ల గోపాలరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. అన్నదమ్ముల్లా ఉన్న మాదిగ, మాలలను పాలకులు విడదీస్తున్నారని, ఈ పరిణామాలు రాబోవు రోజుల్లో పాలకులు అనుభవిస్తారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాయి రాజా, తలారి నాగరాజు, తంబళ్ళ మంగయ్య, దాసరి వెంకటేష్, లక్ష్మణ్, క్రాంతి, అరవింద్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అశ్వాపురం: రాష్ట్రంలో కుటుంబ సర్వేలో బీసీ కులాలకు న్యాయం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చు వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బారాజు సంపత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మచ్చా నరసింహారావు, నాయకులు తూము పెదరాఘవులు, ఆవుల రవి, బేతం బాబు, సామకూరి వెంకన్న, పద్దం నరసింహారావు, వేల్పుల నారాయణ, గొర్ల నాగేశ్వరరావు, మచ్చా నాగేశ్వరరావు, ముత్తయ్య, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.